
కథానిక

# రేపటి వార్త

భూపాల్




రోడ్డుకి ఇరువైపులా కొండలు, గుట్టలు. ఆకు పచ్చదనం ఆహ్లాదకరంగా వుంది. ఆ గుట్టల కింద చేల మిసమిసలు. మా ముందు కనిపిస్తున్న రాళ్లమయమైన ఆ గతుకుల రోడ్డు, తలమీద పాపిటలా మెరుస్తోంది. అందమైన చేలు, దానికో ఆకర్షణని వులిమాయి. సాయంసమయం కనుక చూస్తుండగానే ఎండ పండువారి పసువు సొగసుల్ని ప్రకృతిపై ఎగజిమ్మింది.

'ఆహా! ఎంత అందమైన ప్రదేశం! ఎంత చక్కటి చల్లగాలి' అనుకున్నాం. కొండల పాదాల పైన ఏటవాలుగా వున్నా రాళ్లూరప్పలు లేకుండా చదును చేసుకుని రైతులు ఏవో విత్తనాలు చల్లు కున్నారు. చూడముచ్చటగా వరుసలతో ఎదిగిన చేలు గాలి తాకిడికి లయబద్ధంగా ఆడుతున్నాయి. వాటి పక్కనే అక్కడక్కడ ఇప్పడే దున్నిన గుడ్డాల నేల జాజురంగుతో కళ్లకింపుగా వుండి చిత్రకారుని హృదయ ఫలకాన్ని కుంచెలతో ముంచేస్తోంది.

మా కారులో చిత్రకారుడున్నాడు. ఆయన ముఖంలో అప్పటి ప్రకృతి సోయగమంతా తలు వుతట్టి లేపినట్టు కనిపిస్తోంది. అతని పక్కనే కూర్చున్న విద్యావేత్త, ప్రజాసంస్కృతి విషయంలో పరిశోధనాసక్తి గల ప్రొఫెసర్ బిసెలరీ సోడా బుడ్డి మూత తీసినట్టు పొంగిపోతున్నాడు. అతనిపక్కన కూర్చున్న కళాకారుడు కారుని నిమిషం ఆపితే పాట పాడుతూ సంతోషంతో నృత్యం చేసేలా వున్నాడు. ముందు కూర్చున్న సినిమా దర్శకుడు "ఇంత గొప్ప సౌందర్యం మనకింత దగ్గరలో వుందా? ఆశ్చర్యం! మనం నిజంగా తెలంగాణాలో లేం.. ఏ ఊటీలోనో, కాశ్మీర్‌లోనో వున్నాం.. ఇది కలా నిజమా? ఇక్కడ మంచి స్టూడియో ఏర్పాటుచేసుకుంటే ఎంత బాగుండూ? ఎంత గొప్ప సీనరీ ఇది?" అంటున్నాడు.

మాముందు వెళుతున్న కారు ఆగింది. మేమూ ఆపాం. అందులో నుంచి మిత్రుడు పురావస్తుగారు దిగారు. అప్పటికే మేం కొల్లాపూర్ దాటి సోమ శిల వెళ్లే మార్గంలో సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో వున్నాం. రెండు గుట్టల మధ్య.. తొలచి రోడ్డు చేసినట్టు తెలుస్తూనే వుంది. "సార్ ఇక్కడే నక్సలైట్లు మందుపాతర పెట్టి ఎస్‌పిని లేపేసింది. ఆ సంఘటన జరిగి సంవత్సరంపైనే అయింది. అతనెక్కి వచ్చిన వాహనం ధ్వంసమై పైకెగిరి అదిగో పైన వున్న ఆ కరెంటు తీగలకు వారం రోజులవరకు వేళ్ళాడింది" అన్నాడు ఆ ప్రాంత మంతా చూపిస్తూ... ముందు కార్లో కూర్చున్న సినిమా ప్రొడ్యూసర్ ఇంకా ఇద్దరు లాయర్లు దిగి చుట్టూ పరవశించి చూస్తున్నారు. విడియోగ్రాఫర్ తన తోడు తెచ్చిన స్టిల్ కెమెరాని తీసి దిక్కులు చూస్తున్నాడు. చుట్టూ అద్భుతమైన దృశ్యాలే...

మా పురావస్తుగారి మాట వినగానే నా గుండెల్లో రైళ్ళు పరిగెత్తసాగాయి. 'అయితే సరిగ్గా నక్సలైట్ల ఏరియా కొచ్చామన్నమాట. మహబూబ్‌నగర్ జిల్లా కల్లోలిత ప్రాంతం కాదే! ఇక్కడి కొస్తే తిరిగి హాయిగా ఇంటికెళ్ళవచ్చుననుకున్నాను. ఎస్‌పీనే ఎగ రేసినవాళ్లు మమ్మల్ని ఏం చేస్తారో.. ఒకవేళ కిడ్నాప్ చేస్తే!!!'

మళ్లీ కార్లు బయలుదేరాయి. చీకటిపడ్డాక సోమ శిల గ్రామం చేరాం. నక్సలైట్లు ఎక్కడ తారసప డతారో అని నా మనసులో వున్నా ఒక్కసారి వాళ్ళ దళాన్ని, వాళ్ళనీ, వాళ్ల వేషధారణ, మాటల తీరునీ చూడాలని కోరిక వుంది. ఏ.కె. ఫార్టీసెవన్ ఎలా వుంటుందో చూడాలి!... ఎవరూ అలా కనిపించలేదు. గ్రామం నిండా గతుకుల బాటలు. గొర్లూ మేకలు. బర్లూ ఆవులు. గుడిసెలు. అక్కడ క్కడ సగం సగం కాంక్రీట్ ఇళ్ళ కట్టడాలు. గుడ్డి వెలుతురు లైట్లు. వీధుల్లో పొగ, దుమ్మూ...

పురావస్తు గారికి మాంచి పలుకుబడి వుంది. అక్కడ ఎంత కాలం వున్నారో! ఊరినిండా ఆయనవైపు ఎత్తిన నమస్కారాలే. ఇద్దరిని ఏదో సహాయానికి రమ్మంటే ఇరవైమంది హాజరయ్యారు. నాకు మాత్రం ఇక కిడ్నాప్ అవుతామన్న భయం పోయింది.

'సోమశిల' దేవాలయాల చరిత్ర కల ఊరట. శ్రీశైల జలాశయం నీటిముంపుకు గురైన సుమారు వందా యాభై గ్రామాలలో సోమశిల ఒకటి. నీట మునిగే గుళ్లనూ, శిల్ప సంపదను పైకితెచ్చి గడ్డమీద పెట్టి ఆ రాతి గోడల కట్టడాలతోనే రాష్ట్ర పురావస్తు శాఖవారు మళ్ళీ గుళ్ళను నిర్మించి విగ్రహాలను ప్రతిష్టించారు. నీట మునిగిన భూములకు డబ్బు ఇంకా రాక కొందరి బతుకులు మునిగే వున్నాయి.

అక్కడి ప్రతి గుడి శైవ సాంప్రదాయాన్ని తెలియ జేస్తోంది. అన్ని గుళ్ళ ఆరాధ్య దైవం ఇంచుమించు శివలింగమే. అయితే మేం హైదరాబాద్ నుంచి బయలుదేరి కేవలం 'లింగ' దర్శనానికే వెళ్ళలేదు. శిల్ప సంపత్తిని చూసేకన్నా మరో ముఖ్య విషయం వుంది. అది సోమశిలకి దగ్గర్లో వున్న చిత్తారి గుట్టల మీద క్రీస్తు పుట్టుక ముందు ఎనిమిది వందల సంవత్సరాల నాడు ఏ జానపదుడో గుహ రాతిపైన చెక్కిన చిత్రాలు, గీసిన కొన్ని వింత బొమ్మలున్నాయని) చూద్దామని వెళ్ళాం. అంతే కాదు మా డైరెక్టరూ, ప్రొడ్యూసర్ గార్లకు మంచి లొకేషన్స్ కూడా కావాలిగా..

చిత్తారి గుట్టల సందర్శన రేపు ఉదయం వుంది. సోమశిల నుంచి కృష్ణానదిలో 'పుట్టి' ప్రయాణం చేయాలి. శ్రీశైలం ఎగువ నీరు ఇది. ప్రవాహ కదలికలు కనిపించడం లేదు. చెరువులా స్థిరంగా వుంది కృష్ణ మందహాసం చేస్తోంది. చల్లని గాలులు చిమ్ముతోంది.

ఆ రాత్రి ఆ ఊరివాళ్ళతోనే 'చెంచు భాగవతం' ప్రదర్శన వేయించారు మా పురావస్తుగారు. పురు షులు స్త్రీల వేషాలు ధరించి పాడిన పాటలు, ఆడిన ఆటలూ అద్భుతం. భాగవతం పూర్తిగా ప్రదర్శించే సమయం లేక ప్రధాన ఘట్టాలు కొన్ని వేసి చూపించారు. నరసింహస్వామి కళ్ళకు వల్లని

అద్దాలతో రంగప్రవేశం చేశారు. చెంచు లక్ష్మి, ఆదిలక్ష్మి, స్వామితో ప్రేమ కలాపాలు, వాదవలు. రాత్రి మూడు గంటలు దాటేవరకు చూశాం. ఒకవేళ ఇంత రాత్రి నక్సలైట్లే వస్తే? వచ్చి ఈ ప్రదర్శన చూస్తే ఏమంటారో అనుకున్నాను. ఏమంటారు... "మన సాంప్రదాయాలకు, జానపద కళారూపాలకు, ప్రాచీన కళలకు మేం విరోధులం కాము. కానీ, ఆ కళారూపాల నైపుణ్యాన్ని తీసుకుని, వాటిల్లో మన సాంఘిక సమస్యలను మేళవించి ఈ కాలానికి అనుగుణంగా రాజకీయ అవగాహనతో ప్రదర్శిస్తే బాగుండునంటాం. ఎంత సేపూ భక్తి భావం కాదు, మూఢ నమ్మకం కాదు, కాస్తా భుక్తిమార్గం కోసం ప్రజల కళలను ఉపయోగించుకోవాలి" అంటారు బహుశా.

రాత్రి అదే తెల్లవారుజామున నిద్రకుపక్రమిస్తూ ఈ రోజు చూసిన ప్రదేశాలను మననం చేసుకున్నాను.

జడ్చర్ల దాటి వస్తూ మధ్యలో వర్థమానపురం చూశాం. దాన్నే నంది వడ్డేమాన్ అంటారట. పొలాల్లో శిథిలమౌతున్న గుళ్ళే వుంది నంది.

11వ శతాబ్దంలో కందూరు చోళులు పుట్టకోట కట్టి ఏలిన రాజసం. ఈ పుట్టకోట మట్టితో మాత్రమే కట్టింది. తర్వాత 16వ శతాబ్దంలో గోన గన్నారెడ్డి, గోన బుద్ధారెడ్డి మొదలైన రాజులు చెన్నకేశవస్వామి గుడి కట్టించారట. గుళ్ళన్నీ పాడుపడిపోయి వున్నాయి. అంతటా గబ్బిలాల కంపు నానా చండాలపు వాసన. ఆ ఊళ్లో వున్న 'త్రికూటం' అనే త్రిమూర్తుల గుళ్లను ప్రస్తుతం ప్రజలు 'లంజ గుళ్ళు' అనే పిలుస్తున్నారు. ఆ లంజగుళ్లు పాడుపడి, కూలిపోతూ జనాలకు మరుగుదొడ్లుగా ఉపయోగపడుతున్నాయి. ఆ త్రికూటాన్ని దూరం నుంచి చూస్తే గుళ్ళమీద శిల్పం చెక్కుచెదరలేదు. దాన్ని ఇప్పటి వాడుక భాషలో మంచి ఎలివేషన్ అంటామేమో. చూడముచ్చటగా వుంది. ఏది ఏమైనా ఆనాడు రాజులేలిన, పేరెన్నిక గన్న ఆ కోటలోని రాజధాని ప్రస్తుతం ఊరు. ఊరినిండా మురికి కంపు, కూలిన, కూలనున్న ఇల్లు. గుళ్ల దగ్గర పందుల మలం కంపు, నానా బీభత్సం. వెలవెలపోతున్న వీరభద్రుడి విగ్రహం.

అటునుంచి కొల్లాపూర్ మండలంలోని పెంట్లవెల్లి దాటాం. ఆ ఊరి అంచున కృష్ణా బ్యాక్ వాటర్' చాలా గుళ్ళను పునర్నిర్మించారు. ఒకేచోట సుమారు ఇరవై గుళ్ళకు పైగా వున్నాయి. ఎన్.టి. రామారావు వాటిని నిర్మించిన కొత్తలో హెలికాప్టర్‌లో అక్కడి కెళ్ళారట. ఆయన కాషాయ వస్త్రాలు ధరించాడని గుళ్లకన్నింటికీ అదే రంగు వేయించారట– పురావస్తు శాఖ అధికారులు. ఎంతో చక్కటి శిల్పసంపద.. రంగు పులిమి పాడుచేసి ఎంత వెర్రి ముదిరినవాళ్ళో నిరూపించుకున్నారు. ఆ రంగు గుళ్లమీద ఇప్పటికీ వెక్కిరిస్తోంది. ఆ గుళ్లూ కంపు కొడుతున్నాయి. దర్శించే నాథుడు లేక పందులకు, గాడిదలకు, కుక్కలకూ నిలయాలై వున్నాయి. మరోవైపు పెద్ద గుడి. ఆ గుడి ముందు గాలిగోపురం సుమారు పదిహేను ఏళ్లనుంచి ఇంకా నిర్మాణంలోనే వుంది. గుడిలో శివలింగం. ఎంతో జాగ్రత్తగా పునర్నిర్మించిన కళావైభవం ఆ గుడి. అయినా పరిశుభ్రతకూ, పవిత్రతకూ నోచుకోలేదు.

ఇదంతా జ్ఞాపకం చేసుకున్న నాకు ఒకవేళ నక్సలైట్లే ఆ గుడి దగ్గర తారసపడితే ఏమనేవాళ్ళో అనుకున్నాను. "సోదరా! ప్రాచీన శిల్పసంపద, కళా వైభవం మన జాతికి గర్వించదగ్గ విషయాలే. కాదనం. మన పూర్వుల గొప్పలు చెప్పకుంటే కడుపు నిండుతుందా? రాజుల పైస రాళ్లపాలన్నట్టు ఎవరికోసం ఈ గుళ్ళు, ఈ గోపురాలూ? ఇవి ఎవరి ఆకలి తీర్చుతున్నాయి? కోట్లాది రూపాయలు వెచ్చించి వీటిని పోషించ చూస్తున్న ప్రభుత్వం ఆ డబ్బుతో పేదల బాధలను ఎందుకు తీర్చలేదు? ఇదంతా కర్మసిద్ధాంతం వైపు ప్రజల్ని లాక్కెళ్ళే కుయుక్తి కాదా? ఒక్కసారి గుండెమీద చెయ్యేసుకుని ఆలోచించు" అంటారు కాబోలు.

ఆ రోజు రెండుగంటలే నిద్రపోయాను. ఉదయం ఆరుగంటలలోపే మెలుకువొచ్చింది.

ఏడున్నర ప్రాంతంలో అందరం కలిసి నదీ స్నానానికెళ్ళాం. మేం వెళ్ళేసరికి నది ఒడ్డున ఓ జీపు వుంది. తీరంలో ఆరుగురు వ్యక్తులు స్నానాలు చేస్తున్నట్టు దూరం నుంచి గమనించాను. నక్సలైట్లేమో అనుకున్నాను. తీరా దగ్గరకెళ్ళి చూస్తే అందరూ బోడి తలలతో వున్నారు. స్నానం చేసి సూర్య నమస్కారాలు చేస్తున్నారు. నక్సలైట్లు గుళ్లు గీయించుకోరు, సూర్య నమస్కారాలు చేయరని తెలిసి నవ్వుకున్నాను.

నదిలో దూరం వరకు ఈది స్నానం పూర్తిచేసి బయటికొచ్చాక ఎవరో 'ఆమధ్య ఓ మొసలి వచ్చిందని, దాన్ని చూసి భయపడ్డ ఊరిజనం తుపాకితో కాల్చినా దానికేమీ కాలేదని, తర్వాత వెళ్ళిపోయిందని' అన్నారు. బలికానురా బాబూ అనుకున్నాను. మిగతావాళ్ళు ఒడ్డునే స్నానం చేశారు. వాళ్ళకేం భయం లేదు. నేను స్నానం చేసి బయటికొచ్చి అక్కడ బొగ్గు ఆకారంలో వుండి, బక్కగా ఎముక గూళ్ళలా నిలబడి వున్న ఇద్దరు పిల్లల్ని చూసి "బాబూ ఇక్కడికి మొసలి వస్తుందా ఎప్పుడన్నా?" అని అడిగాను.

అబ్బాయి పది సంవత్సరాలలోపే వున్నాడు. అర్ధ నగ్నంగా, అతడి చెల్లి బహుశా మూడు సంవత్సరాలలోపుదే పూర్తి నగ్నంగా నిలబడి పట్నవాసులమైన తెల్లని రంగుదేలిన మమ్మల్ని వింత జంతువులా అన్నట్టు చూస్తున్నారు. నేనడిగిన ప్రశ్నకు 'రావు' అని మాత్రం జవాబు చెప్పాడు.

"మొసలంటే నీకు తెలుసా?" మళ్ళీ అడిగాను.

"తెలుసు. మనుషులను తినేది" అన్నాడు. ఇక మరేం మాట్లాడలేకపోయాను.

టిఫిన్ ఆరగించి, రెండు గ్రూపులుగా విడిపోయి రెండు పుట్టీల్లో మైలుదూరం గంట నీటిపై పయనించి చిత్తారి గుట్టలు చేరాం. గుట్టల



పాదం నుంచి పైకి కొనకొమ్మకు చేరేవరకు ఎంత కష్టమైందో చెప్పలేం. ఎప్పుడూ గుట్టలూ, కొండలెక్కినవాళ్ళం కామైతిమి, ప్రతి వంద అడుగులకు చమటతో తడిచిపోతూ ఊపిరి ఎగపోస్తూ ఎక్కాం. మాతో వచ్చిన పుట్టీలు నడిపినవాళ్లు, వాళ్ళతో పాటు మా గైడ్ అరవై అయిదేండ్ల వ్యక్తి ఎంతో తేలిగ్గా చకచకా గుట్టను ఎగపాకారు. దట్టంగా అడవి పైకెళ్ళుతుంటే. గుట్టల మయం. నక్సలైట్లే వస్తే!! అందరినీ ముఖ్యంగా హైదరాబాద్‌వాళ్లని కిడ్నాప్ చేస్తే?! అదే ప్రశ్న మా డైరెక్టర్‌ని అడిగాను. అతను నవ్వుతూ నక్సలైట్లు ఇప్పడొచ్చి మనల్ని కిడ్నాప్ చేసి తక్కువలో తక్కువ డిమాండ్‌గా 'సాయంత్రంలోగా మాకు ప్రభుత్వం 'టీ' తాగించకపోతే ఈ పదిమంది బందీలను చంపేస్తాం'మనే అంటారనుకో! అందుకు చంద్రబాబు ప్రభుత్వం ఏమంటుందో తెలుసా? 'చంపేయండి. మేము మాత్రం మీకు టీనీళ్ళు పోసేది లేదు' అంటుంది. ఎందుకంటావా? మనతో ప్రభుత్వాని[illegible] గద్దెవర

కంత లాభం లేదు కనుక!" అన్నాడు.

అక్కడున్న అందరం గొల్లున నవ్వాం. నిజమే నక్సలైట్లు మమ్మల్నెందుకు తీసుకెళతారూ? అను కున్నాను. అయినా వాళ్లను చూడాలని వుంది కనుక తీసుకెళితే బాగుండునని అనిపిస్తోంది ఓ వైపు.

తీరా గుట్టలపైకి వెళ్ళి ఎంత వెదికినా చిత్రాలు, చెక్కడాలు ఏమీ కనిపించలేదు. క్రితంసారి చూసిన వ్యక్తీ, ఆ పెద్ద మనిషి ఆ ప్రత్యేక ప్రదేశాన్ని గుర్తుపట్ట లేకపోయారు. తిరిగి తిరిగి అలసిపోయాం. అప్పటికే సాయంత్రం నాలుగు దాటుతోంది. ఇక లాభం లేదని తిరుగుముఖం పట్టాం. కొండ ఎక్కడం ఎంత కష్టమైందో దిగడమూ అంతే అయింది. గుట్టమీదంతా రాళ్లు చిన్నవీ. పెద్దవీ కాలు పడితే జారుతున్నాయి. ఎంతో జాగ్రత్తగా దిగవలసి వచ్చింది. అందరి శరీరాలూ హూనమయ్యాయి. ఆ ఊరివాళ్లవి తప్ప.

రాత్రి ఎనిమిది గంటలకు రెండు కార్లూ తిరుగు ప్రయాణమయ్యాయి. మేము కూర్చున్న కారు ముందుకు పరుగెడుతోంది. వెనక మా మిత్రుడు ప్రొడ్యూసర్ కారు. మేం వెనక వస్తున్న కారు కోసం ఎదురుచూడక నేరుగా కొల్లాపూర్ చేరుకున్నాం. అక్కడ ఏదో మెడికల్ ఎయిడ్ కోసం వెనకున్న కారు వచ్చేదాకా ఆగవలసి వుంది. ఊళ్ళోకి రాగానే మూడు రోడ్లు కలిసేచోట కాస్త ముందుకు ఓ పాత మేడ. మేడ చుట్టూ కాంపౌండ్ వాల్ వుంది. లైట్లు మసకగా వెలుగుతున్నాయి. గేటు ముందు కారుని ఆపాం. ఎవరిదో పాత భవనంలా వుంది. ఈ సమయంలో ఎవరొస్తారు, ఇటుగా స్తంభం దగ్గర ఆపమని చెప్పి ఆపించాడు మా డైరెక్టర్.

ముందు అతను దిగగా, ఆయనతోపాటు చిత్ర కారుడైన మిత్రుడూ దిగాడు. నీళ్ళు తాగేందుకు బాటిల్ కారులో నుండి తీసుకున్నారు. డైరెక్టర్ తన చేతిలో వున్న బాటిల్‌ని ఆ మిత్రునికి ఇస్తుండగా చేయి జారి కింద పడింది. గేట్‌వైపు నేల వొంపుగా వుంది కనుక గేట్ లోపలికి సీసా దొర్లుతోంది.

వాళ్ళిద్దరూ దానికోసం వెంపర్లాడి, పరుగులాంటి నడకతో ఒంగుని అందుకు చూస్తు న్నారు. అందుకునేలోపలే లోపల దూరంగా వున్న మేడవైపునుంచి విజిల్స్ మోతలు వినిపిస్తున్నాయి. "ఎవరు మీరు? కారెందుకు అక్కడ పెట్టారు?" అంటున్నారు. "మీరెవరు? కారు పెడితే ఏమైంది? కాస్సేపట్లో వెళ్ళిపోతాం" అంటున్నాం మేము.

విజిల్స్ మోతలు ఎక్కువయ్యాయి.

ఆ మేడ చుట్టూ నలుగురైదుగురు కనిపి స్తున్నారు. వాళ్ళు కేకలేస్తూ మమ్మల్ని రమ్మని పిలుస్తున్నారు. కానీ, ఒక్క అడుగు ముందు కేయకున్నారు. మేమూ అదే మోస్తరుగా "మీరే రండి మేమెందుకు రావాలి?" అంటున్నాం. వాళ్ల పిలుపులూ, మా నిరాకరణా అంతా ఓ వింత వాతావరణం నెలకొంది. ఇంతలో గోడ బయట రోడ్డువైపు నుంచి ఓ పదిమంది వచ్చి నిలబడ్డారు. అందులోనుంచి "ముందు కారు తీయండి. ఇది పోలీస్ స్టేషన్" అన్నారు ఒకరు.

"ఓహో పోలీస్ స్టేషనా? మాకేం తెలుసు? బోర్డు కూడా లేదు. పోలీసు డ్రస్సులో ఎవరూ కనిపిం చరేం?" అన్నాం కారుని అటునుంచి కదిలిస్తూ.. అంతేకాదు "మరి పోలీసులే అయితే ఎందుకింత భయం?" అని అన్నాం.

"అట్లా వున్నాయి మా పోలీసు బతుకులు. ఈ ప్రాంతం సీరియస్‌నెస్ మీకు తెలియదా? నక్సలైట్ల మయం. ఎప్పుడు స్టేషన్ పేల్చిపోతారో తెలియదు. మా జాగ్రత్త మాకుండాలిగా! ప్రశ్నించింది చాలు ఇక వెళ్ళిపొండి" అన్నారు మరో సివిల్ పోలీస్. ఆ మాటల్లో ఏదో బతికి బయటపడ్డారనే భావం.

తెలియక అక్కడ నిలబడ్డ మా మీదికి స్టేషన్ లోపలి నుంచి పైన వేసివున్న గుడారాల నుంచి వాళ్ల ముందు జాగ్రత్త చర్యగా తుపాకులు పేల్చివుంటే ఏమయ్యేవాళ్ళం?

నీళ్ళ బాటిల్ క్రిందపడి పొర్లిన ఆ చిన్న సంఘ టనకే పూర్తి అలర్ట్ అయినవాళ్ళు ఒకవేళ కాల్పులే జరిపివుండే రేపు ఉదయం పేపర్లలో వార్త ఏమని వచ్చేదో!!

## పొత్తిళ్ళలో




అమ్మ పొత్తిళ్ళలో
ఆడుకోవడం ఇష్టం నాకు
పాలు తాగుతూ
ఒడినిండా నేనై
అనంతానంత సందేదనల్ని నింపుకున్న
అమ్మ కళ్ళలోకి అలాగే చూడాలనిపిస్తూ వుంటుంది
తన గాయలని నా చిట్టిచేతులతో స్పృష్టిస్తూ
ఉండాలని పిస్తూ ఉంటుంది
తెంపబడ్డ బంధాల కోసం పెనుగులాడి

కాసింత సేపు సేద తీరనివ్వాలి
నా చిట్టి మాటల పాటలతో బాధల్ని మరిచేట్టు
చేయాలి
నా పెదాలలో తల్లి గాయాల్ని ముద్దాడాలి
అమ్మకి ఇష్టం ఉండదు కాని
నాకు అమ్మ ఒడిలోనే చనిపోవాలని ఉంటుంది
(నా తల్లి స్ట్రగుల్)

సదానందం పెట్టుగడి